
ప్రజాశక్తి

మంగళవారం 20 ఆగస్టు 2024



21న జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం ఈనెల 21న ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్, జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ చైర్మన్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11గంటలకు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ నూతన సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

రాకపోకలకు ఇక్కట్లు

- కత్తిమీద సాములా తయారైన సరకు రవాణా
- ఘాట్ రోడ్డు మీదుగా వెళితే వాహనాలకు మరమ్మతులు
- నిర్మాణంలో గ్రీన్ ఫీల్డ్ హైవే
- ఛిద్రమైన సాలూరు - మక్కువ రహదారి

ప్రజాశక్తి - సాలూరు

ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు తరచూ సరుకు రవాణా చేసే వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం ఛత్తీస్గఢ్ రాజధాని రాయపూర్, ఒడిశాలో జయపూర్, నవరంగపూర్ ప్రాంతాలకు లారీలతో సరుకు రవాణా జరుగుతోంది. గతంలో సాలూరు నుంచి సుంకి ఘాట్ రోడ్డు మీదుగా సరుకు రవాణా వాహనాలు వెళ్తుండేవి. ఈ రహదారి మీదుగా లోడులతో లారీలు ఎక్కువగా వెళ్లడం వల్ల తరచుగా వాహనాలు మరమ్మతుకు గురయ్యే పరిస్థితి వుండేది. లారీల ఛాసీలు, ఇతర భాగాలు తొందరగా అరిగిపోవడమో, పాడవడమో జరుగుతుండేది. దీంతో లారీల యజమానులు ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లకుండా మైదాన ప్రాంత రహదారి మీదుగా రాయపూర్ వెళ్లడానికి ప్రత్యామ్నాయ రహదారులు వెతుక్కుంటున్నారు. విశాఖపట్నం పోర్ట్ నుండి రాయపూర్‌కు ఎక్కువగా సరుకు రవాణా చేసే వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సుంకి ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లడం వల్ల తరచుగా వాహనాలు మరమ్మతుకు గురి కావడమే కాకుండా ప్రమాదాలు జరగడం కూడా ఇబ్బందిగా మారింది. దీంతో విశాఖపట్నం నుంచి లోడుతో వెళ్లే వాహనదారులు బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది. అయితే గత కొంతకాలంగా పారాది వంతెన శిథిలావస్థలో వుండడం, ప్రత్యామ్నాయంగా నిర్మించిన కాజ్‌వే వర్షాలకు కొట్టుకుపోవడంతో ఆ రహదారి మీదుగా రాకపోకలు నిలిపివేశారు. ఈ రహదారిపై రాకపోకలు నిలిపివేయడంతో రాయపూర్ వెళ్లే వాహనదారులు సాలూరు నుంచి మక్కువ మీదుగా పార్వతీపురం వెళ్లే రహదారిని ఎంపిక చేసుకున్నారు. సాలూరు నుంచి మక్కువ వరకు 16కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా మిగిలి పోయాయి. రూ.55 కోట్లతో ప్రారంభమైన ఈ రహదారి పనులు అసంపూర్తిగా ఉండిపోవడం, ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా ఛిద్రమైంది. పెద్ద పెద్ద గోతులతో రహదారి నిండిపోయింది. పారాది వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో మక్కువ రహదారి మీదుగా కొంతకాలం లోడుతో వాహనదారులు రాకపోకలు సాగించారు. ఈ రహదారి కూడా గోతులతో ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు సాలూరు నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా పార్వతీపురం వెళ్లే రహదారిని ఎంచుకున్నారు. భారీ లోడుతో వెళ్లే వాహనాలకు ఈ రహదారి అనుకూలమైంది కానప్పటికీ వాహనదారులు కొంతమంది దీని మీదుగానే వెళ్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ రహదారి కూడా పాడయితే ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు సరుకు రవాణా చేసే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.



సాలూరు- మక్కువ వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ పెద్ద గొయ్యిలు

నిర్మాణంలో గ్రీన్ ఫీల్డ్ హైవే

విశాఖ జిల్లా సబ్బవరం నుంచి రాయపూర్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గాని ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు సరుకు రవాణా చేయడంలో ఇబ్బందులు తప్పేలా లేవు. 2026 నాటికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంతవరకు రాయపూర్‌కు సరుకు రవాణా చేసే వాహనాలకు ప్రయాణం కత్తిమీద సాములా మారుతుంది.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

జిసిసిపై మంత్రి సమీక్ష

సాలూరు : గిరిజన సంక్షేమశాఖ సమీక్షా సమావేశంలో ఆ శాఖ మంత్రి జి.సంధ్యారాణి పాల్గొన్నారు. తొలిసారిగా సమావేశానికి హాజరైన మంత్రి సంధ్యారాణికి జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిసిసి కార్యకలాపాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

లేదు.. లేదంటూనే ప్రశ్నించే గొంతుపై నిర్బంధకాండ

- శివ్వాం దళితుల భూపట్టాలెందుకివ్వరు? : రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి
- అరెస్టులు, నిర్బంధాలు నడుమ కొనసాగిన ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద పోలీసుల అడ్డగింపు
- డిఆర్ఒ, ఆర్‌డిఒ రాక.. సమస్యల పరిష్కారానికి హామీ
- హామీలు అమలు చేసే వరకూ దీక్షలు కొనసాగిస్తామన్న దళితులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై ఎలాంటి నిర్బంధాలు లేవంటూ.. ఒకటి, అరా తమకు తెలియకుండా జరిగితే అందుకు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రశ్నించే గొంతులపై పోలీసులు యథేచ్ఛగా నిర్బంధాలు విధిస్తూనే ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాంలో 50 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూములను కొందరు భూస్వాములు ఆక్రమించి వారిపై దాడి చేసి, ఈ ఏడాది సాగు చేయకుండా అడ్డుకొని, తప్పుడు గణాంకాలతో కోర్టు నుంచి ఇంజక్షను ఆర్డర్లు తెచ్చుకొని ఇబ్బందులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట 34 రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించు కోకపోవడంతో నిస్సహాయ స్థితిలో సోమవారం బాధితులు సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి వివిధ గ్రామాలకు చెందిన దళితులను, రైతుసంఘం, ప్రజా సంఘాల నాయకులను గృహ నిర్బంధాలను విధించి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి హాజరు కాకూడదంటూ సాక్షాత్తు పోలీసు అధికారులే ముందస్తు నోటీసులు పంపించి బెదిరించే పనులు చేయడం పట్ల దళితులు, పేద రైతులు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని నిర్బంధాలు విధించినప్పటికీ సోమవారం శివ్వాం గ్రామానికి చెందిన రైతులు, వారికి అండగా నిలిచిన రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయానికి బయలుదేరారు. సమస్యలు చెప్పుకోవడమే నేరమన్నట్లు పోలీసులు కార్యాలయానికి దూరంగా చర్చి జంక్షన్ లోనే దళితులను, నాయకులను అడ్డుకొని, కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించారు. అయితే అధికారులు దగ్గరకు వెళ్తే అడ్డుకుంటున్నారు కనుక, అధికారులే తమ వద్దకు వచ్చి సమస్య పరిష్కారంపై మాట్లాడాలని స్థానిక జూనియర్ కళాశాల కూడలిలో వారంతా బైఠాయించారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, పార్వతీపురం టౌన్ ఎస్ఐ రవీంద్ర రాజు విషయాన్ని జిల్లా రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో, జిల్లా రెవెన్యూ అధికారి కేశవ నాయుడు, ఆర్డీవో హేమలత కార్యాలయం నుంచి బయటకు వచ్చి నిరసనకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ, శివ్వాం గ్రామంలోని దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యతో పాటు, జిల్లాలోని పలు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు వినతులిచ్చినా స్పందించకపోవడం తో 35 రోజుల నుంచి రిలే నిరాహారదీక్షలు చేసినప్పటికీ ఎవరూ స్పందించకపోవడం శోచనీయమని, వెంటనే దళితులను భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి జిల్లా రెవెన్యూ అధికారి స్పందిస్తూ ఈ సమస్య కోర్టులో ఉన్నందున తాము జోక్యం చేసుకోవడం లేదని, ఈ సమస్యను కలెక్టర్‌కు తెలియజేసి, వారి ద్వారా సిసిఎల్ఎ అధికారులకు నివేదించి అతి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని, తమకు కొంత గడువు కావాలని కోరారు. నాయకులు అందుకు అంగీకరించి అంతవరకు తమ నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ వై.మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, నాయకులు పి.రాము, మర్రి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మనాయుడు, గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, కె.రామస్వామి, సిఐటియు నాయ కులు డి.రమణారావు, వి.ఇందిరా, కొల్లి సాంబమూర్తి, బాధిత గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న నాయకులు, శివ్వాం దళితులు



డిఆర్ఒ, ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు : సిపిఎం

పార్వతీపురం టౌన్/పాచిపెంట : జిల్లాలో పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయించడం అన్యాయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, మండంగి రమణ అన్నారు. సోమవారం చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న సాంబమూర్తితో పాటు గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, కెవిపిఎస్ నాయకులు పెంటయ్యను సౌందర్య థియేటర్ వెళ్లే రహదారి వద్ద, సిపిఎం గరుగుబిల్లి మండల నాయకులు బివి రమణ, శివ్వాం దళిత నాయకులు లక్ష్మణరావును స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అలాగే కోరాడ ఈశ్వరరావు, మండంగి రమణను వారి ఇళ్లల్లో గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమన్నారు. పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలని, దళితులు, గిరిజనుల అన్యాక్రాంతమైన భూములు వారికి అప్పజెప్పాలని ఈ సందర్భంగా కోరుతున్నామని, లేనిచో ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

అర్జీల పరిష్కారంలో పనితీరు మెరుగుపడాలి

- ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ సమీక్ష
- వంద రోజుల గృహ నిర్మాణ లక్ష్యాలు చేరాలి
- మన బడి - మన తోట పెద్దఎత్తున చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అర్జీల పరిష్కారంలో మండల యంత్రాంగం పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గృహ నిర్మాణం, సంపూర్ణ పోషణ అభియాన్, పిఎసిఎస్ కంప్యూటరీకరణ, ఇ - పంట తదితర అంశాలపై సోమవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ప్రామాణికత విధిగా పాటించాలన్నారు. సాలూరు, సీతంపేట మండలాల నుంచి ఎక్కువ వినతులు వస్తున్నాయన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు జిల్లా స్థాయికి వస్తున్నాయని, ఇలా రావడం మండల స్థాయి పరిపాలనా యంత్రాంగం విఫలమైనట్లు భావించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మండల స్థాయి సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రికార్డులు, ధ్రువపత్రాలు ఉండాల్సిందేనని చెప్పారు. అర్జీలు అందిన 24 గంటల్లోగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒక్క అర్జీ కూడా ఎస్ఎల్ఎ కాలం దాటరాదని, ఫిర్యాదులు రీ ఓపెన్ కారాదని సూచించారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) సమీక్ష జరుగుతుందని తెలిపారు.

గృహ నిర్మాణం జిల్లాలో ప్రాధాన్యత అంశంగా తీసుకున్నట్టు తెలిపారు. వచ్చే వంద రోజుల్లో 2,128 గృహాలు పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. రోజువారీ లక్ష్యాల సాధనలో జరుగుతుండడం పట్ల గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్లను ప్రశ్నించారు. ఆర్ఎల్, ఆర్‌సి స్థాయికి వచ్చిన గృహాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. లబ్ధిదారులను ప్రేరేపించాలని, అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. పిఎం జన్‌మాన్ గృహ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పిఎసిఎస్ కంప్యూటరీకరణ మాసాంతానికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన కార్యాచరణ మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పౌష్టిక ఆహారం అవగాహన కల్పించడం పెద్ద ఎత్తున చేపట్టాలని, ఇందులో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు.

మన బడి మన తోటలను పెద్ద ఎత్తున చేపట్టి, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, సంపూర్ణ పోషణ అభియాన్ ఇన్ ఛార్జ్ లక్ష్మీకాంత్, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహకార ఆడిట్ అధికారి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

23న గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బలిజిపేట మండలం పెదపెంకిలో పారిశుధ్యంపై స్థానిక ఎంపిడిఒను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. పంచాయతీలో పారిశుధ్యం సక్రమంగా లేదని, ఫైలేరియా వ్యాప్తి ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దానిపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పారిశుధ్యం సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల దోమల వృద్ధి చెంది వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, కావున తక్షణమే వాటిపై చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని ఎంపిడిఒను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని డిప్యూటీ సీఎం అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల గుర్తింపునకు గ్రామ పంచాయతీ బాధ్యత వహించాలని సూచించారు. వార్డు సభ్యులు పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయితీ గ్రామసభ, వార్డు సభల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పథకం చేపట్టడానికి సాధ్యమయ్యే పనుల షెల్ఫ్‌ను నిర్వహించాలన్నారు. అప్పుడే పని కోసం డిమాండ్ ఏర్పడుతుందని వివరించారు. ఉపాధి చట్టం 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

గ్రామసభల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు

ఉపాధి హామీ చట్టం ద్వారా వేతనాలు పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన కార్యక్రమం. ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను గ్రామ సభల్లో చదివి ప్రజలకు వివరించడం. 2024-25 సంబంధించి కొత్త పనుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన పెంచడం. దీనికి సంబంధించి, అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ అనుబంధ పనుల జాబితా

కొత్తగా ఫీడర్ కాలువ నిర్మించడం, కొత్త పంట కాలువల నిర్మాణం, పొలం గట్లపై మొక్కల పెంపకంపై అవగాహన, రైతుల భూముల్లో ఫారం ఫాండ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు, వ్యక్తిగత భూముల్లో భూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వ్యక్తిగత భూముల్లో బెంచ్ టెర్రసింగ్ నిర్మించేలా చూసుకోవాలని, రైతుల భూముల సరిహద్దు, కందకాలు నిర్మించడం, వ్యక్తిగత భూముల్లో వ్యవసాయ బావి నిర్మాణం చేపట్టాలని, పండ్ల తోటల్లో రింగు ట్రెంచుల నిర్మాణం, పండ్ల తోటల్లో భూసార సంరక్షణ కందకాలు తవ్వడం, రైతుల భూముల్లో గడ్డి పెంపకం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పశువులు, గొర్రెలు, కోళ్ల ఫారాల నిర్మాణం, పట్టుపురుగుల షెడ్ టైపు 1, పట్టుపురుగుల షెడ్ టైపు 2, ఎంఐ ట్యాంకుల పునరుద్ధీకరణ పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ట్యాంక్ సరిహద్దు చుట్టూ కందకం తవ్వి మొక్కలు పెంచడం, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాలు, వ్యక్తిగత భూముల్లో పండ్ల తోటల పెంపకం, పూల తోటల పెంపకం మల్లె, గులాబి తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మల్బరీ తోటల పెంపకం, పండ్ల మొక్కల నర్సరీలు పెంచడం, మునగ నర్సరీల పెంపకం, టేకు, ఇతర అటవీ జాతి మొక్కలు నర్సరీల్లో పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు పెంపకం, కొండ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, కెనాల్ గట్లపైన మొక్కలు పెంపకం, కమ్యూనిటీ భూముల్లో బ్లాక్ ప్లాంటేషన్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మడ అడవులు పెంపకం, పంట కాలువల్లో పూడిక తీయుటకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వివరించారు. ఇరిగేషన్, పెద్ద కాలువలు, డ్రైన్లలో, ఫీడర్, మైనర్ డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక తీసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకర రావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెదపెంకిలో పారిశుధ్యంపై డిప్యూటీ సిఎం ఆరా



డిప్యూటీ సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

'వెన్నుపోటు పొడిచే వారికి తగిన బుద్ధి చెబుతాం'

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్టీకి వెన్నుపోటు పొడిచే వారికి తగిన బుద్ధి చెప్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రతో పాటు, మండల టిడిపి అధ్యక్షులు, పలువురు నాయకులు రాష్ట్ర అధ్యక్షుడ్ని ఆయన కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో టిడిపి అభివృద్ధికి మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎవరైతే న్యాయం చేశారు? ఎవరు అన్యాయం చేశారు సరైన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర కోరారు. మరో 40 ఏళ్ల పాటు పసుపు జెండా రెపరెపలాడాలంటే అందుకు యువతను ప్రోత్సహిస్తూ పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేయాలని కోరారు. గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ మీద బతికే వారికి పదవులు ఉండవని, పార్టీ కోసం పని చేసిన వారికి మాత్రమే పదవులు వరిస్తాయని అన్నారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లగా ఎంతోమంది పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారని, అనేక వేధింపులకు గురయ్యారని, ఆస్తులు నష్టపోయారని అన్నారు. అటువంటి వారందరి జాబితా అధినాయకుని వద్ద ఉందని, పార్టీ కోసం పనిచేసే వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఎవరైతే పార్టీకి వెన్నుపోటు పొడిచే ప్రయత్నాలు చేశారో అటువంటి వారికి తగిన బుద్ధి చెప్పడం జరుగుతుందని, అవసరమైతే సస్పెండ్ కూడా చేస్తారని అన్నారు. పార్టీ పేరు చెప్పుకొని ఎంతో లబ్ధి పొంది అవసర సమయంలో వెన్నుపోటు పొడిచే వారికి అధినాయకత్వం తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తప్పక న్యాయం జరుగుతుందని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

కెజిబివిని సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కెజిబివి పాఠశాలను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్ఫెస్ సోమవారం అకస్మకంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న భోజనం వసతులు గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూంలో ఉన్న సరుకులను, వంటగదిలో వంటలను, నీళ్ల ట్యాంకులు, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందితో ఆమె మాట్లాడారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, వంటగది, నీళ్ల ట్యాంకు మరుగుదొడ్లు ఇంకా మెరుగ్గా పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.కిరణ్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినిలతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సౌమ్య జోస్ఫెస్



పిఎసిఎస్ కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పిఎసిఎస్ కంప్యూటరీకరణ పూర్తిచేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక సహకారశాఖ కార్యాలయంలో వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. కంప్యూటరీకరణ పనులకు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన సభ్యుల వివరాలను కంప్యూటరీకరించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను స్వావలంబన చేయడానికి ప్రభుత్వం కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టిందని, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుకు సదరు డేటాను జాతీయస్థాయిలో అనుసంధానం జరుగుతుందని అన్నారు. తద్వారా పిఎసిఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీచేయడం, లావాదేవీల ఖర్చులను తగ్గించడం, చెల్లింపుల్లో అసమతుల్యతను తగ్గించడం జరుగుతుందన్నారు. సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని, రైతుల్లో పిఎసిఎస్ పనితీరులో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సిఎఎస్), మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) అమలు ద్వారా పిఎసిఎస్‌లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, రుణాలు పొందడానికి, రుణాల రీషెడ్యూలు పనుల్లో రైతులకు వేగవంతమైన సేవలు అందించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



అటవీశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అటవీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో అడవి ఏనుగుల సమస్య ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తన క్యాంప్ ఆఫీసులో అటవీశాఖ అధికారులతో సోమవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి సంబంధించి ప్రణాళిక తయారు చేయమని అటవీ శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అలాగే ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకి పరిహారం నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండకుండా ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏజెన్సీలో ఎక్కువగా డి పట్టాలు సమస్య ఉందని, వీటికి అటవీశాఖ నుంచి రావాల్సిన అనుమతులు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన, జియమ్మ వలస ఎంపిపి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకడ రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ , గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రైబుల్ రైట్ ఫోరం అధ్యక్షులు లోవరాజు ఉన్నారు.

వికటించిన పసర మందు.. చిన్నారికి అస్వస్థత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో నాటు మందు వికటించడంతో నాలుగు నెలల చిన్నారి తీవ్ర అస్వస్థకు గురైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని మూలజమ్ము గిరిజన గ్రామంలో బిడ్డిక సహస్ర అనే నాలుగు నెలల చిన్నారికి అనారోగ్యం వాటిల్లడంతో పసర మందు పట్టారు. దీంతో చిన్నారి తీవ్ర అస్వస్థకు గురి కావడంతో వైద్యం కోసం బంధువులు భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రూ.1.53 లక్షలకు మార్కెట్ వేలం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మేజర్ పంచాయతీ పెదబోగిలి రోజువారీ మార్కెట్ వారపు సంత 2024-25 ఆర్థిక సంవత్సరం గాను వేలంపాట రూ.లక్షా53 వేలకు మద్రి అప్పమ్మకు చెందినట్లు ఇన్చార్జి ఇఒ బి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తెరీజమ్మ, వేలం పాటదారులు పాల్గొన్నారు.



ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న జెసిబిని సీజ్ చేసిన అధికారులు

ఇసుక అక్రమ రవాణాకు కట్టడి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురం, అన్నవరం, అంపిలి ఇసుక రీచుల నుండి అక్రమంగా తరలిపోతున్న ఇసుక రవాణాకు అధికారులు అడ్డుకట్టు వేశారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన ఆ ఇసుక ఎక్కడికి అన్న వార్తకు సోమవారం అధికారులు కదిలారు. ఎస్సై ప్రశాంత్ కుమార్ గోపాలపురం ఇసుకరీచును పరిశీలించి అనధికారకంగా వెళ్తున్న ఇసుకను అడ్డుకట్టు వేశారు. అక్కడున్న జెసిబిని సీజ్ చేశారు. అదే విధంగా తోపుడు బండ్లతో ఇసుక డంప్ చేయడానికి అడ్డుకున్నారు. ఈ చట్టవ్యతిరేక చర్యని హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశాలోని రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వ్యానులో 20 పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి కేసు నమోదు చేసి వాహనాన్ని, పశువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ వాహనానికి, అలాగే పశువులకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పశువులను హింసించే చట్టం కింద కేసు నమోదు చేశామని తెలిపారు.



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు


నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అధికారులు బాధ్యతతో పని చేసి ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ ఆర్.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 132 దరఖాస్తులు అందాయి. స్వీకరించిన వినతుల్లో కొన్ని....

పాలకొండ మండలం ఎం.సింగుపురానికి చెందిన బి.రవికుమార్ తమ గ్రామంలో ఉన్న సిసి రోడ్లపై అక్రమంగా పశువులను కడుతున్నారని, వాటి వల్ల ప్రజలు, విద్యార్థులు, వాహనచోదకులు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయం పైన గ్రామపంచాయతీ కార్యాలయానికి అనేకసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించలేదన్నారు. పశువులను ఎంపియుపి స్కూల్ ముందు కట్టడం వల్ల విద్యార్థులు ఆ రోడ్డుపై వెళ్లేందుకు భయభ్రాంతులు గురవుతున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పశుయజమానులపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు.

గరుగుబిల్లి మండలం గదబవలసకు చెందిన ఇ.ధర్మారావు తమ గ్రామానికి సమీపంలో ఉన్న క్వారీ గుంతల్లో అక్రమ విద్యుత్‌ను ఉపయోగించి కొంత మంది మోటర్ల సహాయంతో నీటిని తోడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. తోటపల్లి బ్యారేజీలో గుర్రపుడెక్కను తొలగించాలని పార్వతీపురం మండలం కొత్తవానివలసకు చెందిన ఇ.తిరుపతిరావు కోరారు. జియ్యమ్మవలస మండలం పరజపాడు గ్రామానికి చెందిన జి.రామకష్ణ నాయుడు తమ గ్రామంలో ఉపాధిహామీ కింద చేపట్టిన సిసి కాలువలు, రోడ్లు నిర్మాణాలు చేపట్టామని, తమకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కొమరాడ మండలం కళ్లికోట గ్రామానికి చెందిన జి.నవీన్ ఇంటి స్థలం మంజూరు చేయాలని, పాలకొండ మండలం చిన్నమంగళాపురానికి చెందిన పి.అమావాస్య 1.87 సెంట్లు భూమిని ఎన్ని బాబ్జీ నాయుడు ఆక్రమించుకున్నారని, తన భూమిని రీ సర్వే జరిపించాలని దరఖాస్తు అందజేశారు. సీతంపేట మండలం గుమడకు చెందిన పి.శశిరేఖ సర్వే నంబర్ 31-179 కొండపోడు భూమిని 40ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూమిని వేరే వారు ఆక్రమణ చేసుకుంటున్నారని, కొండపోడు భూమికి సర్వే జరిపించి తమ భూమిని తమకు అందించాలని అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వాస్తవ ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వాస్తవాలు కలిగిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు ప్రారంభించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం కార్యక్రమంలో భాగంగామ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, భర్త,అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సిఆర్‌బి సిఐ బి.ఎం.డి.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

సమస్యలు పరిష్కరించండి

సీతంపేట : తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు విన్నవించారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిఒ వివి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దబగ్గకు చెందిన ప్రమీల పెన్షన్ మంజూరు చేయాలని, సవర సిద్ధి మానుగూడకు చెందిన వరలక్ష్మి ఎఎన్ఎం పోస్ట్ ఇప్పించాలని వినతిని అందజేశారు. అమ్మిమానుగుడకు చెందిన శంకర్రావు ఆటోలోను ఇప్పించాలని, మెట్టుగూడకు చెందిన మంగయ్య పవర్ టిల్లర్ మంజూరు చేయాలని విన్నవించారు. గ్రంది దుర్గం ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, ఇఇ సింహాచలం, ఎపిడి సన్యాసిరావు, జిసిసి మేనేజర్ కృష్ణ, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల్లో ప్రగతి కనిపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అభివృద్ధి పనుల్లో ప్రతి వారం ప్రగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం కావాలని, ప్రతి వారం ప్రగతిలో మార్పులు ఉండాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు వంద రోజులు, సంవత్సరం, ఐదు సంవత్సరాల ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. ఆయా ప్రణాళికల మేర అభివృద్ధి జరగాలని సూచించారు. ప్రతి శాఖ తన పరిధిలో జరగాల్సిన పనులు, పెండింగ్ అంశాల పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధాన రహదారులపై ప్రమాదాలకు తావులేకుండా గుంతలు పూడ్చాలని ఆర్అండ్‌బి అధికారి ఎం.జేమ్స్‌ను ఆదేశించారు. వాగులు, వంకలు, ఇతర ప్రదేశాల వద్ద సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కొటికిపెంట ఏకలవ్య పాఠశాల, నివాస భవనాల నిర్మాణాలు జాప్యం పట్ల గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. దీర్ఘకాలం జాప్యం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. వర్షాలు అనంతరం పిఎం జన్‌మాన్, గ్రామీన్, అర్బన్ తదితర విభాగాల్లో 2వేల ఇళ్ల లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.

వారంలో రెండు రోజులు మండలాల్లో పర్యటించాలి

మండల ప్రత్యేక అధికారులు వారంలో రెండు రోజులు (మంగళ, శుక్ర వారాలు) విధిగా మండలాల్లో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల పర్యటనలో భాగంగా ప్రతి అంశాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. వాటితో పాటు సొంత శాఖ పనుల పురోగతి సైతం పరిశీలించాలని అన్నారు. ప్రాధాన్యత అంశాల పట్ల మరింత శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో జెసి ఎస్ ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు రాజరాజేశ్వరి, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, డిఇఒ జి.పగడాలమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

విద్యాబోధనలో ఎస్‌జిటిలు కీలకం : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యా బోధనలో ఎస్‌జిటిలు కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు చదివించడం, రాయించడం, చతుర్విభ వచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లెసన్ ప్లాను డైరీ సక్రంగా నిర్వహించేలా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు మధ్యాహ్న భోజన సదుపాయం, మరుగుదొడ్లు నిర్వహణ వంటిపై పర్యవేక్షణ చేయాలన్నారు. టిఎల్‌ఎం ఉపయోగించి పాఠ్యాంశాన్ని బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. మీ అనుభవాన్ని పిల్లలతో షేర్ చేసుకోవాలన్నారు. బడి తోట వంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. విద్యా వ్యవస్థ అభివృద్ధిలో వీరఘట్టం మండలం ముందుందని అదే కొనసాగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సోంబోర, ఎస్.సుధీర్, ఎం.పైడిరాజు, కె.విజయ్‌కుమార్, పిడి ఎస్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అనేక చోట్ల భూ కబ్జాలు, భూ దందాలు, భూ కుంభకోణాలు, చెరువుల కబ్జాలు జరిగాయని, వీటిని పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అనేక చోట్ల చెరువులు, ఇతర భూములు గత ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలు విపరీతంగా చేసి కొంతమంది రాజకీయ పెద్దలు, నాయకులు సొంత ప్రయోజనాలకు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. అటువంటి భూములను వెంటనే ప్రభుత్వం గుర్తించి, సర్వే జరిపి ప్రభుత్వం ద్వారా స్వాధీనం చేసుకుని, నిరుపేద బాధితులకు ఇళ్ల స్థలాలు, అలాగే వ్యవసాయ భూములుగా ఇప్పించి బాధిత ప్రజల్ని ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. అలాగే కురుపాం మండలం మొండెంఖల్, గుమ్మలక్ష్మీపురం మండలం కొండశిఖరాల్లో గల గిరిజనులు ఇళ్ల స్థలాలు కావాలని గతంలో అర్జీలు పెట్టుకున్నప్పటికీ ఇంతవరకు ఇళ్ల స్థలాల కేటాయింపు చేయలేదన్నారు. 800 మంది గిరిజన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, వారు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఐ నాయకులు ఇవి నాయుడు, కూరంగి గోపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు పశువైద్యాధికారి కె.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గాలిగుంటి వ్యాధి బారిన పడిన పశువులు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గటం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవటంతో రైతుకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. పాలు తాగే దూడల్లో మరణాలు, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు కూడా చనిపోతాయన్నారు. టీకాలు వేయడం వల్ల వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించి, వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా నివారించవచ్చనని తెలిపారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడి, పశువుల గుర్తింపునకు చెవి పోగు వేయటం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. కావున ప్రతి రైతు టీకాలు వేయించుకోవాలని కోరారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న జ్ఞారత్నం; డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు రాఖీ కడుతున్న ఆయన సోదరి హేమాక్షి; తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రక్షా బంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్‌కు బ్రహ్మ కుమారీ సంస్థ సిస్టర్ జ్ఞాన రత్నం రాఖి కట్టారు. ఈ సందర్భంగా ఆమెకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

కురుపాం : క్కా, చెల్లెల్లు, అన్నదమ్ములకు ఆత్మీయ అనురాగాల పండగ అయిన రాఖీ పండగ వేడుకలు సోమవారం మండలంలో చిన్నారులు, పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి రక్షాబంధన్ చాటుకొని తమ ప్రేమ, ఆప్యాయత అనుబంధానన్ని ఒకరినొకరు పంచుకున్నారు.

సీతానగరం: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి తన అన్నయ్య డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ జగన్మోహన్ తన సోదరి హేమాక్షిని ఆశీర్వదించి దీవెనలు అందించారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి, అనురాగ ఆప్యాయతలు చిరకాలం నిలిచేందుకు రక్షాబంధన్ పండుగ దోహదపడుతుందని, ప్రజల్లో సోదర, సోదరీ భావాల్ని ఇనుమడింపజేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి - వీరఘట్టం

రక్తదానం మరొకరికి ప్రాణదానంగా అవుతుందని ఎన్జీవో సంఘం పాలకొండ తాలూకా నాయకులు లిల్లీ పుష్పనాథం ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మేము సైతం అనే కార్యక్రమం ద్వారా ఈనెల 20న స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నామని, దీనికి మీ అందరి సహకారంతో రక్తం దానం చేసే వారికి అవగాహన కల్పించి రక్తదాన శిబిరానికి తరలించాలని కోరారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి వీరఘట్టం తహశీల్దార్ కార్యాలయం వద్ద వాహనం ఏర్పాటు చేశామనానరు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు కార్యాలయం వద్దకు చేరుకుంటే అక్కడ నుంచి వాహనం ద్వారా రక్తదాన శిబిరానికి తరలిస్తామన్నారు. రక్తదాన శిబిరానికి హాజరైన వారు గ్రహించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు, అధ్యాప కులకు రక్తదాన శిబిరంపై అవగాహన కల్పించారు. మరిన్ని వివరాలకు 9182005018 ఫోన్ నెంబర్‌ను సంప్రదిం చాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మునాయుడు, విఆర్వో జి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయపాల్గొన్నారు.



రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కొమరాడ మండలంలోని చోళ్లపదంలో ఉన్న అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను కాపాడాలని, తద్వారా ఖాతాదారులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం అగ్రిగోల్డ్ కష్టమర్స్, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులు, భూములను కాపాడాలని కోరుతూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు మాట్లాడుతూ కొమరాడ మండలం చోళ్లపదం రెవెన్యూ పరిధిలో సుమారు 78 ఎకరాల వ్యవసాయ భూములను అగ్రిగోల్డ్ సంస్థ అప్పట్లో కొనుగోలు చేసిందని, ఆ భూముల్లో టేకు, మేన్జియం ఇంకా విలువైన తోటల పెంపకం చేపట్టిందని, 2015 జనవరి నుంచి అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేసిందన్నారు. ఆ తర్వాత ఎపి సిఐడి రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను సీజ్ చేసిందన్నారు. ఇందులో భాగంగా మన జిల్లాలో వేలాది మంది ఖాతాదారులు అగ్రిగోల్డ్ సొమ్మును తిరిగి ఇప్పించమని అనేకసార్లు నిరసనలు, నిరాహారదీక్షలు, వినతిపత్రాల ద్వారా ప్రభుత్వానికి, కోర్టుకు విన్నవించుకున్నాయని తెలిపారు. భూముల్లో ఉన్న లక్షలు విలువ చేసే టేకు చెట్లను దొంగలు యథేచ్ఛగా కొట్టుకొని పోతున్నారని, బాధితులు డబ్బులు తిరిగిరాక నేటికీ దినదిన గండంగా గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున సిఐడి అటాచ్మెంట్‌లో ఉన్న పై ఆస్తులను రక్షించమని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, అగ్రిగోల్డ్ కష్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాలాపు అనంతరావు, అసోసియేషన్ నాయకులు ఆర్.ఆదినారాయణ, బిటి నాయుడు, బంకురు సత్యం, సురేష్, రామారావు మహారాణా, ఎన్. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గ్రామాల్లో బడి బయట పిల్లలను గుర్తించిన అనంతరం వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి నగిరెడ్డి నాగభూషణరావు అన్నారు. ఈ మేరకు గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నాగభూషణరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు నిర్వహించిన సర్వేలో గుర్తించిన పిల్లలను పదో తరగతిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించిన అనంతరం సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్‌లో జాయిన్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీల్లో బడి బయట ఉన్న పిల్లలను వెల్ఫేర్ అసిస్టెంట్లు త్వరితగతిన గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ -2 కె.కొండలరావు పాల్గొన్నారు.



మృతిచెందిన వైద్యురాలికి నివాళ్లు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

డిగ్రీ కళాశాలలో నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

కోల్‌కత్తాలో జరిగిన ఇటీవల జూనియర్ డాక్టర్ హత్యాచారాన్ని ఖండిస్తూ సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుశాంత్ జన ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన గంట్రేటి సురేష్ విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టి వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే మండలంలోని చేపలకంచేరుకు చెందిన అరజల్ల రాజు, రామచంద్రపేటకు చెందిన సుగ్గు రమణ, కొంగవానిపాలెం గ్రామానికి చెందిన కోరాడ శ్రీను కలిసి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. విమానాశ్రయం నిర్మాణంలో కార్మికులతో వారికి వివాదం జరిగింది. అనంతరం ఆ కార్మికులు తమ నివాసాలకు వెళ్లిపోయారు. దీంతో మద్యం మత్తులో ఉన్న వీరు ముగ్గురు గేటు వద్దకు వచ్చి లోపలికి వెళ్లబోయారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డ్ సురేష్‌పై దాడి చేశారు. అక్కడ రాడ్డుతో బలంగా తలపై కొట్టడంతో కోమాలోకి వెళ్లిపోయాడు.